సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం | 14 | డిసెంబర్ | 2024



చదరంగ కీర్తి.. గుకేశ్ స్ఫూర్తి
సరదాగా స్నేహితులతో కలిసి సినిమాలు, షికార్లు చేసే వయస్సులో చెస్‌లో జగజ్జేతగా నిలిచాడు. కలలో కూడా ఊహించని చరిత్రను తిరగరాశాడు. - 8లో▸



ఉద్యాన పంటలకు భవిష్యత్
ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్ ఉందని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 27.2°/13.3°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కావేరి జ్యోతిని సన్మానించిన మంత్రి



పలిమెల: ఇటీవల కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన భారతీయ జట్టులో సభ్యురాలిగా ఉన్న మండలానికి చెందిన కావేరి జ్యోతిని రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొనేందుకు తన ప్రయాణానికి కావాల్సిన ఖర్చులను సమకూర్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా కావేరి జ్యోతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నిర్వహించాలి
భూపాలపల్లి అర్బన్: నేడు(శనివారం) జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో జిల్లాలోని 61 పాఠశాలల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రత్యేక వంటకాలతో తయారు చేసిన భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా హామీని అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. 23 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కోడిగుడ్డు ధరలను పెంచాలని, గ్యాస్ సిలిండర్లు, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.


సంతకాల సేకరణ
భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియాలోని కేటీకే-1వ గనిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపేటి రాజయ్య మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు చిరకాల వాంఛ సొంతింటి కల సాకారం చేయాలని కోరారు. సింగరేణిలో కాలం చెల్లిన క్వార్టర్లను కూల్చివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

17న ధర్మగ్రహ దీక్ష
రేగొండ: హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 17న చేపట్టనున్న ధర్మగ్రహ దీక్షకు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం రేగొండ, కొత్తపల్లిగోరి, మడతపల్లి ఉన్నత పాఠశాలలో తపస్ ధర్మగ్రహ దీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. జీఓ 317 సమస్యపై పాత జీఓలు ఇచ్చి నిరాశ పరిచారని, అశాస్త్రీయమైన జీఓ 317ను రద్దు చేసి స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించి వారిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకులు నూతి నవీన్‌కుమార్, కట్కూరి బాపురెడ్డి, దొనికెల రామ్‌మోహన్, సాదుల విద్యాసాగర్, కోడెం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిట్రేగి స్మగ్లింగ్

పలిమెల అడవుల్లో భారీ జిట్రేగి చెట్ల నరికివేత
- దుంగలను అక్రమంగా ఖమ్మం తరలింపు
- విలువైన అటవీ సంపద స్మగ్లర్ల పాలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అటవీ అధికారులు



గత నెల 4న భూపాలపల్లి రేంజ్ అధికారులు పట్టుకున్న జిట్రేగి కలప వాహనం

భూపాలపల్లి: అడవుల ఖిల్లాగా పేరొందిన జిల్లాలో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతోంది. సుమారు పదిహేనేళ్ల పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి టేకు కలపను అక్రమంగా రవాణాచేసిన స్మగ్లర్లు, ఇప్పుడు ఏకంగా జిల్లాలోని అడవుల్లో ఉన్న విలువైన భారీ జిట్రేగి చెట్లను నరికి దుంగలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందుకు కొందరు అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పలిమెల రేంజ్ నుంచే..

జిల్లాలోని పలిమెల రేంజ్ పరిధిలో భారీ జిట్రేగి చెట్లు ఉన్నాయి. సుమారు 30ఏళ్ల నాటి చెట్లు ఒక మనిషి చేతులు చాచి పట్టుకున్నా అందనంత స్థాయిలో ఎదిగాయి. అయితే స్మగ్లర్ల కన్ను ఇప్పుడు వాటిపై పడింది. గడిచిన రెండు నెలలుగా ఆ చెట్లను గుర్తించి నరికి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. స్మగ్లర్లు ప్రధానంగా పలిమెల రేంజ్‌లోని సూరారం గ్రామం నుంచి కుడివైపు గల అటవీ ప్రాంతంలోని జిట్రేగి చెట్లను కూలీల సహాయంతో నరికిపిస్తున్నారు. ఎడ్లబండ్ల సహాయంతో రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతం వరకు తీసుకొని వచ్చి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి వాహనాల ద్వారా అటవీశాఖ అధికారుల కదలికలను గమనిస్తూ భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్, గొర్లవీడు, పరకాల పట్టణాల సమీపానికి తరలించి నిల్వ చేస్తున్నారు.

టాటా ఆర్‌ఎక్స్ పికప్‌లలో రవాణా..

రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచిన జిట్రేగి దుంగలను టాటా ఆర్‌ఎక్స్ పికప్-207 వాహనాల్లో ఖమ్మంకు రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణా చేసే సమయంలో అటవీశాఖ అధికారుల నుంచి ఇబ్బంది తలెత్తకుండా స్మగ్లర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి, కలప డిపోల్లో నిల్వఉంచిన జిట్రేగి దుంగలను వేలం పాటలో కొనుగోలు చేసి అనుమతి పత్రం తీసుకుంటారు. ఆ కలపను ఒక వాహనంలో, అక్రమ కలపను మరో వాహనంలో లోడ్‌చేసి గంట తేడాతో ఒకే రహదారిపై సేమ్ నంబర్ ప్లేట్లతో రవాణా చేస్తారు. స్మగ్లర్లు ఈ రెండు వాహనాల మధ్య వేరే కారులో ప్రయాణిస్తారు. అటవీ అధికారులు ఏ వాహనాన్ని పట్టుకున్నా, అక్కడికి వెళ్లి పత్రాలను చూపించి వెహికిల్ విడిపించుకొని వెళ్తారు. అయితే ఈ తతంగం కొందరు అధికారులు తెలియక, మరికొందరికి తెలిసినా పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టేకు కలపను ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఖమ్మం, రాయలసీయ ప్రాంతాల్లో జిట్రేగి ఫర్నీచర్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో స్మగ్లర్లు జిట్రేగి కలపను అక్కడికి రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

మా దగ్గరి నుంచి కాదు..

పలిమెల రేంజ్ పరిధిలో జిట్రేగి చెట్ల నరికివేత, రవాణా జరగడం లేదు. ఇటీవల జిట్రేగి కలప పట్టుకున్న విషయాన్ని తెలుసుకొని రేంజ్ పరిధిలో పర్యటించాం. ఎక్కడా చెట్లను నరికిన ఆనవాళ్లు కనిపించలేదు.

- నాగరాజు, ఎఫ్‌ఆర్‌ఓ, పలిమెల

ఇటీవల పట్టివేతలు..

అక్రమంగా జిట్రేగి దుంగలను తరలిస్తున్న రెండు వాహనాలను జిల్లాలోని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. గత నెల 4వ తేదీ రాత్రి అక్రమంగా జిట్రేగి దుంగలను తరలిస్తున్న ఒక వాహనాన్ని రేగొండ మండలం బాగిర్తిపేట క్రాస్‌రోడ్ వద్ద భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ పట్టుకొని రూ.1.50 లక్షల విలువైన కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 2వ తేదీన కాటారం నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న వాహనాన్ని పట్టుకొని రూ.2లక్షల విలువైన 24 జిట్రేగి దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవలి కాలంలో అటవీ అధికారులు పట్టుకున్నవి రెండు వాహనాలే అయినప్పటికీ తరలిపోయిన కలప భారీ మొత్తంలోనే ఉంటుందని తెలుస్తోంది.

నేడు మంత్రుల పర్యటన
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రేగొండ, గణపురం, భూపాలపల్లి పట్టణంలో నేడు (శనివారం) మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ పర్యటించనున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం భూపాలపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంత్రులు రానున్నట్లు తెలిపారు. మొగుళ్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్, ముంజాల రవీందర్, పార్టీ నాయకులు దేవన్, బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్, అప్పం కిషన్, క్యాతరాజు సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రేగొండ: మండలంలోని రామన్నగూడెం స్టేజీ వద్ద నిర్మించిన హెలిపాడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం పరిశీలించారు. నేడు (శనివారం) నియోజకవర్గంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ గౌస్‌పాషా, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు సంపత్‌రావు, షాబీర్ అలీ, పున్నం రవి, పట్టెం శంకర్, వీరబ్రహ్మం, మేకల భిక్షపతి, దామోదర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభాస్థలి పరిశీలన

భూపాలపల్లి రూరల్: నేడు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తున్న మంత్రుల రాక కోసం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. అంబేడ్కర్‌సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న విజయోత్సవ(పబ్లిక్ మీటింగ్) సభా స్థలిని శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బ్యాంకులో చెక్కు మాయమైందట!



డిపాజిట్ చేసిన వోచర్



డిపాజిట్ చేసిన చెక్కు

రేగొండ: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు బ్యాంకులో వేయగా నలభై రోజుల అనంతరం చెక్ మాయమైందని బ్యాంక్ అధికారులు చెప్పడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. రేగొండ మండలం జూబ్లీనగర్ గ్రామానికి చెందిన చల్లా సాంబరెడ్డి కొంతకాలం క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.46వేల చెక్కు వచ్చింది. బాధితుడు చెక్కును అక్టోబర్ 30న రేగొండ మండలకేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో వేశాడు. చెక్కు వేసి 40 రోజులు గడుస్తున్నా అకౌంట్‌లో డబ్బులు జమకాకపోవడంతో శుక్రవారం బాధితుడు బ్యాంకు అధికారులను సంప్రదించాడు. చెక్కు కనబడటం లేదని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా చెక్కు మాయమైన విషయం తన దృష్టికి వచ్చిందని, బ్యాంకు అధికారులతో మాట్లాడి బాధితుడికి న్యాయం చేస్తామని తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి
- రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

గోవిందరావుపేట: పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులందరికీ పట్టాలివ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పస్రా రైతుసంఘం కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రైతుసంఘం మండల కమిటీ సమావేశం సామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కన్నోజు సదానందం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తుమ్మల వెంకట రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సాగులో ఉన్న ప్రతీ రైతుకు పట్టా ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదని ఆరోపించారు. మండలంలో వేలాది మంది రైతులు పట్టాదారు పుస్తకాలు లేక వ్యవసాయానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడాల్సిన అవసరం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కమిటీ నాయకులు మారబోయిన సారయ్య, క్యాతం సూర్యనారయణ, యానాల ధర్మారెడ్డి, సప్పిడి యాదిరెడ్డి, సామ శ్రీనివాస్ రెడ్డి, గుండు రామస్వామి, మోడెం కృష్ణ, గుండు లెనిన్, కాప కోటేశ్వరరావు, తీగల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువుకు తగిన ప్రాధాన్యత ఇస్తూ తమ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విద్యార్థులకు సూచించారు. బాల, బాలికలకు అండర్ 20 రాష్ట్రస్థాయి కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కబడ్డీ క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుకునేందుకు మ్యాట్ కావాలని క్రీడాకారులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కబడ్డీ మ్యాట్ అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజు మాట్లాడుతూ.. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి అండర్ 20 విభాగంలో 22మంది బాలురు, 22మంది బాలికలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సేవానాయక్, సెక్రటరీ పండగ శ్రీనివాస్, పీఈటీలు శ్రీనివాసరెడ్డి, శ్రావణ్, రాజు, అజయ్ పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి
ఏటూరునాగారం: సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టీఎల్. రవి డిమాండ్ చేశారు. మూడు, నాలుగు నెలలుగా సంక్షేమ హాస్టళ్లకు మెస్ బిల్లులు విడుదల కాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేసి నిత్యావసర సరుకులు తీసుకొచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



దీక్షలో కుర్చున్న, గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: గత ప్రభుత్వ హయాంలో జిల్లాకేంద్రంలో నిర్మించిన రెండో దశ డబుల్‌బెడ్ రూం ఇళ్లను భేషరతుగా కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూంల వద్ద బాధితులు చేపడుతున్న దీక్షలకు వెంకటరమణారెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. భాస్కరగడ్డ సమీపంలో గత ప్రభుత్వ హయంలో నిరుపేదల కోసం 460 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి డ్రా పద్ధతిలో కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కేటాయింపులను రద్దుచేసినట్లు ఆరోపించారు. ఏడాది కాలం అయినప్పటికీ ఇప్పటివరకు అధికారులు వాటిని లబ్ధిదారులకు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఏడాది కాలంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం
- జీసీడీఓ రమాదేవి

ఏటూరునాగారం: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించడంతో పాటు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని జీసీడీఓ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ కొయ్యడ మల్లయ్యతో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. స్టోర్‌రూమ్, వంట, తరగతి గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థినులతో కరాటే, వ్యాయామం చేయించాలన్నారు. ఉదయం చదవడం, రాయడం చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎస్‌ఓ అరుణను ఆదేశించారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థినులు హైజినిక్‌గా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ అరుణ, టీచర్లు, పాల్గొన్నారు.

కామన్ మె'న్యూ'
- డైట్, కాస్మోటిక్ చార్జీలు 40 శాతం పెంపు
- నేడు లాంఛనంగా ప్రారంభం
- విద్యార్థులతో ప్రజాప్రతినిధుల సహపంక్తి భోజనం
- మెరుగైన వసతులే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు



వరంగల్ శంభునిపేట, దూపకుంట రోడ్‌లో ఉన్న బాలికల మైనార్టీ గురుకులం

న్యూశాయంపేట: ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సాధారణ గురుకులాలు, వసతి గృహాల్లో శనివారం నుంచి కామన్ మెనూ అమల్లోకి రానుంది. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ఇటీవల ప్రభుత్వం 40శాతం మేర డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న గురుకులాల వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. నాణ్యమైన భోజనం, సరుకులు విద్యార్థులకు అందేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ వేసి పర్యవేక్షిస్తోంది. అంతేకాకుండా క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, మోడ్రన్ డైనింగ్, కిచెన్, వాటర్ ఫిల్టర్లు ఉండేలా ప్రణాళికలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నేడు సహపంక్తి భోజనాలు

గురుకులాల్లో మెరుగైన వసతులే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటికే డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో శనివారం నుంచి అన్ని గురుకులాల్లో కామన్ మెనూ అమల్లోకి రానుంది. మొదటి రోజు ప్రజాప్రతినిధులు, అధికారులు కామన్ మెనూను గురుకులాల్లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వ చర్యలుంటాయని, ఆ దిశగా ముందుకు సాగుతున్నట్లు సంక్షేమశాఖల అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోంది..



డైట్‌చార్జీలు పెంచడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుంది. గురుకులాల్లో ప్రతీ నెల నాలుగు రోజులు చికెన్, రెండు రోజులు మటన్ అందిస్తారు. మిగతా రోజుల్లో ఉడకబెట్టిన గుడ్డు కూడా అందిస్తారు. పండ్లు, స్నాక్స్ తదితర బలవర్ధక ఆహారాన్ని అందించడానికి వీలు కలుగుతుంది.

- టి.రమేశ్, వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి

కామన్ మెనూను స్వాగతిస్తున్నాం..



అన్ని సంక్షేమ, వసతి గురుకులాల్లో కామన్ మెనూ, డైట్ విధానాన్ని స్వాగతిస్తున్నాం. ఈ విధానంతో పూర్తిస్థాయిలో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుంది. 8 ఏళ్ల తర్వాత డైట్ చార్జీలు పెంచడంతో విద్యార్థులకు లాభం జరుగుతుంది. వెండర్స్‌కి రేట్లు పెంచకుండా ఇప్పటి రేట్లు అమలు చేయాలి.

- డాక్టర్.జంగా సతీశ్, ప్రిన్సిపాల్ (హనుమకొండ,బి1) మైనార్టీ గురుకులం, హనుమకొండ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా..

మైనారిటీ గురుకులాలలు	16
విద్యార్థులు	6,200
బీసీ గురుకులాలు	43
విద్యార్థులు	23,000
సోషల్ వెల్ఫేర్ గురుకులాల సంఖ్య (భద్రాద్రిజోన్)	
బాలికలు	17
బాలురు	17
డిగ్రీ గురుకులాలు	04
విద్యార్థులు	19,000
గిరిజన గురుకులాలు	33
డిగ్రీ కళాశాలలు	05
విద్యార్థులు	8,000

పెరిగిన డైట్ చార్జీలు (రూ.లలో)

తరగతులు	ప్రస్తుత చార్జీలు	పెంపు అనంతరం
3వ నుంచి 7వ	950	1,330
8 నుంచి 10	1,100	1,540
ఇంటర్, ఆపైన	1,500	2,100

కాస్మాటిక్ చార్జీలు (బాలికలు)

తరగతులు	ప్రస్తుత చార్జీలు	పెంపు అనంతరం
3 నుంచి 7వ	55	175
8 నుంచి10	75	275

కాస్మాటిక్ చార్జీలు (బాలురు) హెయిర్ కటింగ్ చార్జీలు కలిపి

తరగతులు	ప్రస్తుత చార్జీలు	పెంపు అనంతరం
3 నుంచి 7	62	150
8 నుంచి 10	62	200

క్లుప్తంగా

అరుణాచలం గిరిప్రదక్షిణకు ఆర్టీసీ బస్సు



అరుణాచలం బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ ఆర్ఎం మాధవరావు

హన్మకొండ: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతీ నెల బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్ఎం మాధవరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి భక్తులతో అరుణాచలం వెళ్తున్న బస్సును డిప్యూటీ ఆర్ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం దేవాలయాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు. ఈసౌకర్యాన్ని భక్తులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన వరంగల్ జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షైన్ కుమార్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-16, 18, 20 బాలబాలికలతోపాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే 10వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పాల్గొంటారని తెలిపారు. అండర్-16 బాలబాలికలకు 2 కిలోమీటర్ల రన్నింగ్, అండర్-18 కేటగిరీలో 4 కిలోమీటర్ల రన్నింగ్, అండర్-20 కేటగిరీ క్రీడాకారులకు 6 కేఎం రన్నింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ సీనియర్ క్రీడాకారులకు 10కేఎం రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం ఉదయం 8గంటలకు జేఎన్ఎస్‌లోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ఊర యుగెందర్‌రెడ్డి 98665 64422, బండి కృష్ణమూర్తి 90003 54465 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

చదరంగ కీర్తి.. గుకేశ్ స్ఫూర్తి

యువ చెస్ క్రీడాకారుల్లో నూతనోత్తేజం

- బాల్యం నుంచే రాణిస్తున్న చిన్నారులు
- గుకేశ్ విజయంపై హర్షాతిరేకాలు
- 'సాక్షి'తో అభిప్రాయాలను పంచుకున్న క్రీడాకారులు

సరదాగా స్నేహితులతో కలిసి సినిమాలు, షికార్లు చేసే వయస్సులో చెస్‌లో జగజ్జేతగా నిలిచాడు. 18 సంవత్సరాల అతి పిన్న వయస్సులో కలలో కూడా ఊహించని చరిత్రను తిరగరాశాడు. భారత ఖ్యాతిని మరోసారి విశ్వవ్యాప్తి చేశాడు. కుర్రాడిగా పావులు కదుపుతూ సీనియర్ క్రీడాకారుడిని ఖంగుతినిపించి ప్రపంచ మేధావుల దృష్టిని ఆకర్షించాడు. అతనెవరో కాదు దొమ్మరాజు గుకేశ్. ఇప్పుడు ఎక్కడ ఏ ఇద్దరు కలిసినా.. చెస్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్ గురించే చర్చ. ఈ నేపథ్యంలో గుకేశ్ ఆటలో ఎత్తుగడలు, విజయం సాధించిన తీరు, తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా చెస్ క్రీడాకారులు, క్రీడాభిమానుల మనోగతం 'సాక్షి' పాఠకుల కోసం. - వరంగల్ స్పోర్ట్స్



అద్భుత విజయం

అతి చిన్న వయస్సులో గుకేశ్ ప్రపంచ విజేతగా నిలవడం అసాధారణ విషయం. మాలాంటి క్రీడాకారులకు స్ఫూర్తిని అందించాడు. విశ్వవిజేతగా విశ్వనాథన్ ఆనంద్ తర్వాత గుకేశ్ సాధించిన విజయం మాటల్లో చెప్పలేని అద్భుతం. గుకేశ్ ఆట తీరును చాలా సార్లు దగ్గరి నుంచి చూశాను. ప్రపంచ రికార్డు సమయంలో ఆడిన ఆట అందుకు భిన్నంగా ఉంది. వేసే ప్రతి అడుగు ప్రత్యర్థిని ఇరుకున పెట్టేలా ఉంది. గుకేశ్ ఆత్మవిశ్వాసం, ఆట తీరు నాలో మరిన్ని విజయాలు సాధించాలన్న పట్టుదలను నింపాయి.

- వేల్పుల సరయు, మొండ్రాయి, వరంగల్, అంతర్జాతీయ క్రీడాకారిణి



ఆరేళ్లకు ఎలో రేటింగ్



రెండు సంవత్సరాలుగా చెస్ నేర్చుకుంటున్నాను. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన చెస్ టోర్నీలో ర్యాపిడో విభాగంలో దేశ వ్యాప్తంగా 1,485వ ఎలో రేటింగ్ వచ్చింది. మా అమ్మనాన్న చాలా సంతోషపడ్డారు. ఈ రోజు పేపర్లలో గుకేశ్ ఫొటోలు చూపించి, అతని గురించి వివరిస్తుంటే.. నేను కూడా ప్రపంచ విజేత కావాలనే ఆకాంక్ష పెరిగింది. రాంనగర్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న దేవాన్ష్‌రెడ్డి, ఆరేళ్ల వయస్సులోనే జాతీయ స్థాయి రేటింగ్ రావడం విశేషం.

- దేవాన్ష్‌రెడ్డి, రాంనగర్

గుకేశ్ ఆటతీరు నచ్చింది



పదేళ్లుగా చెస్‌లో శిక్షణ పొందుతున్నాను. చాలా మంది గ్రాండ్ మాస్టర్ల ఆటను చూసేవాడిని. విశ్వనాథ్ ఆనంద్, కోనేరు హంపి, ఇరిగేసి అర్జున్ టోర్నమెంట్లను చూశాను. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్, గుకేశ్ స్టైల్ కళ్లు తిప్పుకోకుండా చేసింది. ఆయన ఆడిన టోర్నమెంట్ వీడియోలు చూస్తూనే ఉన్నాను. ఆయన స్ఫూర్తితో ఉన్నత స్థాయి టోర్నమెంట్లలో విజేతగా నిలిచేందుకు శ్రమిస్తా.

- బి.విశ్వజిత్‌సాయి, హనుమకొండ

నేనే ఆడినట్లుగా టెన్షన్ పడ్డాను



ప్రపంచ స్థాయి వేదికగా గుకేశ్ ఆడుతుంటే నేనే అక్కడ కూర్చుని ఆడినట్లుగా టెన్షన్ పడ్డాను. ఆటముగిసే వరకు మా స్నేహితులం ప్రతిక్షణం ఆసక్తిగా వీక్షించాం. నాలుగు గంటలకు పైగా సాగిన ఆ ఆటలో గుకేశ్ విజయం సాధించడం నేను ఎన్నటికీ మరిచిపోలేను. గుకేశ్ ఆట తీరు, ఆయన ఆత్మవిశ్వాసం నాకెంతో స్ఫూర్తిని అందించాయి.

- సూర్యప్రతాప్‌కోటి, 8వ తరగతి, వరంగల్

మిస్టరీ వీడేనా?

- ఏడాది క్రితం నగరంలో అనుమానాస్పదంగా విజయ మృతి
- నేటికీ చిక్కని నిందితుల జాడ
- వంద మందిని విచారించిన పోలీసులు



కోన విజయ (ఫైల్)

కాజీపేట: ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు కిరాతకంగా కొట్టి చంపి ఏడాది కాలం గడిచినా.. హంతకుల ఆనవాళ్లు పోలీసులకు చిక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో ఉండే కోన విజయ (68) అనే మహిళ గత ఏడాది డిసెంబర్ 14న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి విగతజీవిగా ఇంటి పక్క సందులో కనిపించింది. విజయ మృతదేహంపై దుస్తులు సరిగ్గా లేకపోవడంతోపాటు బంగారు నగలు కనిపించకుండాపోయాయి. వెంటనే స్థానికుల సాయంతో విజయ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విభిన్న కోణాల్లో పోలీసుల విచారణ..

పోలీసు అధికారులు కేసు నమోదు చేసి క్లూస్ టీం సభ్యులు, డ్వాగ్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన విజయ దాదాపు 16 గంటలపాటు పట్టణంలో ఎక్కడ ఉంది.. ఒంటిపై ఉన్న బంగారు నగల కోసమే నిందితులు హత్యచేసి ఇంటి వద్ద పడేసి ఉంటారా.. లేక తెల్సిన వాళ్లకు అప్పుడప్పుడు చిన్న మొత్తంలో నగదును ఇస్తుండే విజయను మరెవరైనా హత్య చేశారా.. అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినా ఆచూకీ లభించలేదు. అయితే .. విజయను ఏమార్చి కిడ్నాప్ చేసిన నిందితులు తలపై బలంగా కొట్టి చంపడంతోపాటు శరీరాన్ని పూర్తిగా సబ్బు పెట్టి కడిగి మృతురాలి ఇంటి పక్కన ఉన్న గల్లీలోనే అర్ధరాత్రి వేళ పడేసి వెళ్లారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వెతికినా హత్య ప్రదేశాన్ని గుర్తించకుండా ఉండేందుకు నిందితులు సబ్బుతో కడిగి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమైంది. మృతురాలి శరీరంపై ఉన్న బంగారు నగల కోసమే హత్య చేసి ఉంటారా లేక ఇతర కారణాలు ఏమైనా ఉండి ఉంటాయా.. అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నప్పటికీ పోలీసులకు నిందితులకు సంబంధించిన ఆచూకీ చిక్కకపోవడం అందరిని ఆశ్చర్యం కలిగిస్తుంది. హత్య జరిగినప్పుడు ఉన్న అధికారులు బదిలీపై వెళ్లడంతో కొత్తగా వచ్చిన అధికారులు హత్య కేసు ఫైల్‌ను తిరిగి తెరచి విచారణ జరుపుతున్నారు. ఘటనా సమయంలో ఉన్న అధికారులు ఒక క్రమపద్ధతిలో విచారణ చేయకపోవడం కారణంగానే సమస్య తీవ్రత పెరగడంతోపాటు నిందితులు దొరక్కుండా చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఇప్పటి వరకు సుమారు 100మందిని విచారించారు. చిన్న క్లూ దొరికినా విడిచి పెట్టకుండా నేరస్తుల ఆట కట్టిస్తున్న పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. విజయ కేసులో నానాటికీ చిక్కుముడులు పెరుగుతున్నాయి. మొదట్లో కేసును సునాయాసంగా పరిష్కరించవచ్చని భావించిన పోలీసులకు గతంలో వచ్చిన దృశ్యం సినిమాను జ్ఞప్తికి తేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. సీపీ అంబర్ కిశోర్ ఝా క్రైమ్ సమీక్ష సమావేశాల్లో తరచూ ఈ కేసును పరిష్కరించాలంటూ ఆదేశిస్తున్నప్పటికీ పోలీసుల విచారణ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది.

ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్

- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజిరెడ్డి
- మల్యాల జేవీఆర్ హెచ్ఆర్ఎస్ సందర్శన



జామతోట మదర్ బ్లాకును ప్రారంభిస్తున్న వీసీ రాజిరెడ్డి

మహబూబాబాద్ రూరల్: ఉద్యాన పంటలకు మంచి భవిష్యత్ ఉందని, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు పంటలను కాపాడుకోవాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ) డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానాన్ని వీసీ శుక్రవారం సందర్శించారు. పరిశోధనలను గురించి అడిగి తెలుసుకుని, జామ, మామిడి, సపోట, పసుపు తోటలను, మిర్చి క్షేత్రాలను సందర్శించి, జామతోట నూతన మదర్ బ్లాకులో మొక్కలునాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉద్యాన పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధునిక సాంకేతికతో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి నల్ల తామర పురుగులను అరికట్టి మిర్చి పంటను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. మల్యాల పరిశోధన స్థానం నుంచి అలహాబాద్ సఫేదా జామ రకం, కరొండ రకానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. మల్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఆవుల కుమారివెంకన్న తమ జీపీకి స్థలం కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్యాల జేవీఆర్ హెచ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కత్తుల నాగరాజు, విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అసోసియేట్ డీన్ చీనానాయక్, కేవీకే శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, రాంబాబు, అభ్యుదయ రైతులు సోల్లేటి జైపాల్ రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్ల దొంగలు దొరికారు..!

- వివరాలు వెల్లడించిన పరకాల ఏసీపీ సతీశ్‌బాబు



దామెరలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

దామెర: జల్సాలకు అలవాటుపడి గొర్లు, మేకలను దొంగిస్తున్న బృందం సభ్యులను దామెర పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. పరకాల ఏసీపీ సతీశ్‌బాబు దామెర పోలీస్ స్టేషన్‌లో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని నిజాంపల్లికి చెందిన బొమ్మ తిరుపతి, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయికి చెందిన మల్ల భరత్, వరంగల్ మండలంలోని కొత్తపేటకు చెందిన వంగూరి మధు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన కొత్తకొండ వికాస్ గ్రూప్‌గా ఏర్పడి మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అనంతరం కొత్తకొండ వికాస్ లాంగ్ డ్రైవ్ కోసం కార్లను తీసుకొని గొర్లు, మేకలను దొంగిలిస్తే ఎవరికీ అనుమానం రాదని మిగితా మిత్రులకు వివరించాడు. దీంతో లాంగ్ డ్రైవ్ కోసం కార్లను అద్దెకు తీసుకొని పలుచోట్ల గొర్లు, మేకలను దొంగిలించి హైదరాబాద్, వరంగల్ సంతల్లో అమ్మి వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేసేవారు. ఈ క్రమంలో తిరుపతి, భరత్, వికాస్ ఈ నెల 9 తెల్లవారు జామున మండలంలోని కోగిల్వాయికి కారులో వచ్చి గొర్లను దొంగిలిస్తుండగా గ్రామానికి చెందిన జంగిలి రవి.. వికాస్‌ను గట్టిగా పట్టుకొని అరవడంతో వికాస్.. రవిపై రాయితో దాడిచేశాడు. ఆ తర్వాత కారును, సెల్ ఫోన్ వదిలి ముగ్గురు పారిపోయారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో వదిలి వెళ్లిన కారును తీసుకెళ్లేందుకు నిందితులు శుక్రవారం గ్రామానికి రాగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికిచేరుకొని తిరుపతి, భరత్, మధును అరెస్టుచేసి రూ.3 లక్షలు, 4 సెల్ ఫోన్లు, బెలోనో కారు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కొత్తకొండ వికాస్ పరారీలో ఉండగా అతన్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు. వీరిపై గతంలో 10 కేసులు నమోదు కాగా 63 జీవాలను దొంగతనం చేయగా వాటి విలువ సుమారు రూ.4,98,000 ఉంటుందని ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై అశోక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

- వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



సోమేశ్వరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య మాధవి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని తానిపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం పాము కాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. తానిపర్తికి చెందిన సోమేశ్వరావు(38) తన మిర్చి తోటలో గడ్డి తొలగిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు సోమేశ్వరావును వెంకటాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకొచ్చిన గంట తర్వాత వైద్య సిబ్బంది చికిత్స ప్రారంభించారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది, అధికారులు సకాలంలో వైద్యం చేయకపోవడంతోపాటు ఏటూరునాగారం వైద్యశాలకు రిఫర్ చేశారని తెలిపారు. సోమేశ్వరావును ఏటూరునాగారం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వెంకటాపురం ఆస్పత్రికి తీసుకొచ్చి సిబ్బంది నిర్లక్ష్యంతోనే సోమేశ్వరావు మృతి చెందారని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి రావు ఆస్పత్రి వద్దకు వచ్చి బంధువులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గకేసు ~మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీర జవాన్‌కు ఘననివాళి



గూడూరులో వీరజవాన్‌కు ర్యాలీతో నివాళులర్పిస్తున్న ప్రజలు, నాయకులు

గూడూరు: విధి నిర్వహణలో గుండెనొప్పితో మృతిచెందిన వీర జవాన్ గుగులోతు రమేశ్‌నాయక్ మృతదేహానికి శుక్రవారం రాత్రి గూడూరు మండల కేంద్రంలో పలువురు నాయకులు, యువకులు ర్యాలీగా వెళ్లి, టపాసులు కాల్చి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలం వేపచెట్టుతండా శివారు కోమటిపల్లి తండాకు చెందిన గుగులోతు రమేశ్ నాయక్ (36) 13 సంవత్సరాల క్రితం సీఆర్‌పీఎఫ్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం విధుల్లో ఉండగా గుండెనొప్పితో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని పోలీసు లాంఛనాలతో సైనికులు తీసుకొస్తుండగా రాత్రి 7 గంటలకు గూడూరుకు చేరుకుంది. ప్రధాన సెంటర్‌లో పలువురు పూలమాలలు వేసి, టపాసులు పేల్చి నివాళులర్పించారు.

గ్రామానికి చేరిన జవాన్ మృతదేహం

ఖానాపురం: మండలంలోని కోమటిపల్లితండాకు చెందిన ఆర్మీ జవాన్ గుగులోతు రమేశ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. కాగా ఆర్మీ అధికారులు శుక్రవారం ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రమేశ్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రమేశ్ మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించారు.

రైల్వే ఎన్నికల ఫలితాల వెల్లడి

- రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, సంఘ్‌కు గుర్తింపు



సంబురాల్లో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే పరిధితోపాటు కాజీపేటలో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో ట్రేడ్ యూనియన్ల గుర్తింపు కోసం ఎన్నికలు జరగ్గా గురువారం ఫలితాలు వెల్లడించినట్లు శుక్రవారం రైల్వే మజ్దూర్, రైల్వే సంఘ్ నాయకులు తెలిపారు. ఈ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గెలుపొంది రైల్వేలో గుర్తింపు పొందాయి. రైల్వే ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌లను రైల్వే కార్మికులు ఆదరించి గెలిపించినట్లు ఆయా ట్రేడ్‌యూనియన్ల నాయకులు అన్నారు.

డీజిల్‌షెడ్‌లో సంబురాలు

కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో శుక్రవారం రైల్వే ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా రైల్వే మజ్దూర్ యూనియన్ గుర్తింపు సాధించినందుకు రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసినట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ డిజిల్ బ్రాంచ్ ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపారు. అనంతరం షెడ్ ఆవరణలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- రైల్వే జీఎంకు రైల్వే జేఏసీ వినతిపత్రం



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ బృందం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్, కోచ్ ఫ్యాక్టరీ తనిఖీ నిమిత్తం వచ్చిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌ను శుక్రవారం రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు ఆధ్వర్యంలో 15 సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కాజీపేట రైల్వే పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో భాగంగా కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని, రైల్వే ఆస్పత్రిని సబ్‌డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, వ్యాగన్ పనులు వేగంగా చేపట్టాలని కోరారు. కాజీపేట టౌన్ స్టేషన్‌ను చర్లపల్లిమాదిరి రైల్వే కారిడార్‌గా చేయాలని, కాజీపేటలో ఎలక్ట్రిక్ పీఓహెచ్‌ను నిర్మించాలని, 138 ఏళ్ల నాటి రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌కు నూతన భవనం మంజూరు చేయాలని, రైల్వే స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మించాలని కోరారు. ఇండోర్ షటిల్‌కోర్టును ఉడెన్‌గా మార్చాలని, కాజీపేట కార్మికుల కోసం స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేడియానికి బయటవైపు పబ్లిక్‌టాయ్‌లెట్స్ నిర్మించాలని, రైల్వే కమ్యూనిటీహాల్‌లో ఏసీ నిర్మాణం చేసి రెండో డైనింగ్‌హాల్ నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. రైల్వే జేఏసీ బృందం డి.రవీందర్, పి.రమేశ్, జి.భాస్కర్, ఎస్.లక్ష్మీనారాయణ, అనుమాల శ్రీనివాస్, టి.ప్రవీణ్, ఎం.మహేశ్, కె.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

రాలిన ధాన్యం తిని గొర్రెలు మృతి

- మృతి చెందిన 23 గొర్రెల విలువ రూ.2.60 లక్షలు
- ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న మరో 62 గొర్రెలు



గొర్రెల కళేబరాలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలో పొలంలో రాలిన ధాన్యం తిని గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గొర్రెల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి(కన్నెపల్లి)లో అటవీమార్గం గుండా పందుల గుంపులుగా వచ్చి వరి పొలాన్ని తొక్కడంతో ధాన్యం(వడ్లు) రాలిపోయింది. దీంతో పొలం యజమానులు పంటను కొంతమేర కోయలేదు. కాగా, శుక్రవారం కాపర్లు మెట్‌పల్లి సమీప పొలాల్లోకి గొర్లను మేతకు తీసుకెళ్లారు. అక్కడ ధాన్యం తిన్న మొగిలి మధుకర్‌కు చెందిన 14 గొర్రెలు, మొగిలి శంకర్ 2, మొగిలి పర్వతాలు 2, మొగిలి కత్తరశాల 2, సల్పాల పెద్ద రాజన్న 3 గొర్రెలతో కలిపి మొత్తం 23 గొర్రెలు మృతి చెందాయి. మరో 62 గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితులు పశువైద్యులకు సమాచారం ఇవ్వడంతో మహదేవపూర్ పశువైద్యాధికారి రాజబాపు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గొర్రెలకు వైద్యపరీక్షలు చేశారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.2.60 లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు.

క్రికెట్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరగనున్న అండర్ - 14 ఇంటర్‌స్కూల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును శుక్రవారం వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొదట ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేసిన సెలక్టర్లు వారికి మూడు రోజులపాటు ప్రాక్టీస్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచినవారిలో సెలక్టర్లు అఫ్జల్, రామకృష్ణ తుదిజట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టులో బి.సాత్విక్ (కెప్టెన్), ఓ.సుకుమార్, అశ్విత్, అద్వైతరెడ్డి, పి.హర్షిణి, ఎస్.త్రికరణ్, కె.రిషి, డి.జశ్వంత్, శీటి జీతద్న్, ఎస్.మనీష్‌కుమార్, వి.రాఘవేందర్, బి. ఈశ్వర్‌తేజ్, బి.వశీకర్‌సాయి, ఎం. ప్రీతం, ఎస్.శ్రీతేజ్‌లకు స్థానం దక్కింది. జట్టు కోచ్‌గా అఫ్జల్, మేనేజర్‌గా ఆల్‌ఎల్ ప్రణయ్‌కుమార్‌లు వ్యవహరిస్తారని శ్రీనివాస్ తెలిపారు.